ఆశా కార్యకర్తకు తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో ఇటీవల డయేరియా విజృంభించి పలువురు మృతి చెందిన నేపథ్యంలో అస్వస్థతకు గురైన వారికి రాత్రిపగలూ సేవలందించిన నాగళ్లవలస ఆశా కార్యకర్త పూర్ణిమ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఐదురోజులుపాటు ఆమె డయేరియా రోగులకు సేవలందించి అధికారుల మన్ననలు పొందారు. ఈ నేపథ్యంలో ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్‌కు గురైన ఆమె జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స కోసం చేరారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆమెను ఆశావర్కర్స్ యూనియన్‌జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి పరామర్శించారు. అధికారులు స్పందించి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రూ.10.2కోట్లతో రోడ్ల మరమ్మతులు

- పనులు ప్రారంభానికి 2న సిఎం చంద్రబాబు రాక
- ఇదే వేదికపై నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ
- శంకుస్థాపనకు దెందేరులో ఏర్పాట్లు

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో గత ఐదేళ్లలో తీవ్రంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా నుంచి ప్రారంభించనున్నారు. ఈనెల 2న కొత్తవలస మండలం దెందేరులో ముఖ్యమంత్రి ఈ మరమ్మతు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సిఎం పర్యటన షెడ్యూల్ బుధవారం ఖరారైంది. దీంతో, హెలీప్యాడ్, శంకుస్థాపన, సభ ఏర్పాట్లు సాగుతున్నాయి. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం సిఎం పర్యటనపై ఎస్.కోట నియోజకవర్గంలో పర్యటించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కొన్నేళ్లగా మరమ్మతులకు గురైన ఆర్అండ్‌బి రహదారులు అస్తవ్యస్తంగా మారిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఆర్అండ్‌బి ద్వారా జిల్లాలో 68 రహదారుల మరమ్మతులకు రూ.10.2కోట్లు కేటాయించింది. సుమారు 13 కిలోమీటర్లు పొడవు ఉన్న కొత్తవలస - సబ్బవరం రహదారి బాగా గుంతలు పడి దెబ్బతినడంతో ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయాలని అధికారులు ఖరారు చేశారు. ఈ పనుల ప్రారంభానికి ప్రతి నియోజకవర్గంలోనూ సభలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు రానున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకాన్ని కూడా లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులు లబ్ధిదారుల జాబితాను ఖరారు చేసే పనిలో తలమునకలయ్యారు. జిల్లాలో 5,81, 668 మందికి ఈ పథకం వర్తించే అవకాశం ఉంది. తెల్లరేషన్ కార్డులు వేరుగా ఉన్నప్పటికీ కొంతమంది ఉమ్మడిగా నివాసం ఉంటున్నారు. ఈలెక్కన కొంతమందికి గ్యాస్ కనెక్షన్లు ఉండక పోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ రకంగా పరిశీలించినప్పుడు తెల్లరేషన్‌కార్డుదారుల్లో 90శాతం మంది వరకు ఖచ్చితంగా లబ్ధిపొందేందుకు అవకాశం ఉంటుందని అంచనా. కేవలం మూడు రోజుల ముందు సిఎం పర్యటన ఖరారుకావడం, , దీపావళీ రోజున శెలవు కావడంతో సమయం కాస్త తక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బి, సివిల్ సప్లై, రెవెన్యూతోపాటు ఇతర శాఖల అధికారులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్.కోట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లుపై దృష్టి సారించారు. నవంబర్ 2వతేదీ ఉదయం 10.30 గంటలకు కొత్తవలస మండలం దెందేరు జంక్షన్ వద్ద పనులకు శ్రీకారం చుడతారు. సిఎం పర్యటించే ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఖరారు చేశారు. ఎమ్మెల్యే లలిత కుమారి, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఇతర అధికారులతో కలిసి బుధవారం నియోజక వర్గంలో కలెక్టర్ అంబేద్కర్ పర్యటించారు. పలు చోట్ల దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. ఎల్.కోట మండలం గోల్డ్ స్టార్ జంక్షన్, ఎస్.కోట మండలం తామరాపల్లి, కొత్తవలస మండలంలోని పలు ప్రదేశాలను పరిశీలించారు. సమీపంలోని సంతపాలెం వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.అంతకుముందు ఎస్.కోట తహాశీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రోడ్డు మరమ్మతులను ప్రారంభించిన అనంతరం ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, నేషనల్ హైవే, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో సమీక్షిస్తారని, అనంతరం మీడియాతో మాట్లాడ తారని వెల్లడించారు. రాష్ట్రంలోని రహదారుల పరిస్థితిని వివరిస్తూ ఫోటో ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యటనలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, డిఆర్‌డిఎ పీడీ ఎ .కళ్యాణ చక్రవర్తి, సిపిఒ పి.బాలాజీ, ఆర్ అండ్ బి ఎస్ఇ కాంతిమతి, ఆర్‌డిఒ డి.కీర్తి, తహాశీల్దార్ అరుణకుమారి, టిడిపి నాయకులు కోళ్ల రామప్రసాద్, గొంప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే X మార్క్‌ఫెడ్ చైర్మన్

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం
- ప్రొటోకాల్ విషయంలో గొడవ పడ్డ నేతలు
- సమావేశం మధ్యలో వెళ్లిపోయిన ఎమ్మెల్యే

సమావేశంలో ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నియోజకవర్గంలో జనసేన, టిడిపి నాయకుల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరుతున్నాయి.తాజాగా నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సాక్షిగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మధ్య విభేదాలు బయటపడ్డాయి. బుధవారం నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. సమావేశాన్ని నడిపించే అధికారం ఎమ్మెల్యేకు లేదని బంగార్రాజు ఆరోపించగా, సమావేశం నుంచి బంగార్రాజు బయటకు వెళ్లిపోవాలని ఎమ్మెల్యే అనడంతో సమావేశం రసాభాసగా మారింది. తీవ్ర ఆవేదనకు గురైన ఎమ్మెల్యే సమావేశం రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, అక్కడి నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు. ఆమె వెళ్లిపోయిన తర్వాత బంగార్రాజు సూచనతో చైర్ పర్సన్ బంగారు సరోజిని సమావేశం కొనసాగించారు.

ముందుగా ఈ సమావేశంలో విద్యుత్ స్థంబాలు, లైట్లు సమస్యలపై చర్చ జరుగుతుండగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కలుగు చేసుకొని నగర పంచాయతీలో నిధులు కొరత ఉందని చెప్పగా మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మెన్ కర్రోతు బంగార్రాజు కలుగు చేసుకోని సభ్యులు అడిగిన సమస్యల పై సంబంధిత అధికారులు, ప్రజలు ఎన్నుకున్న చైర్ పర్సన్ సమాధానం చెప్పాలి గాని అన్నీ మీరై సమాధానం చెప్పడమేమిటని ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే లోకం మాధవి ఆగ్రహానికి గురై అసలు సమావేశానికి మీరెందుకు వచ్చారని మీకేంటి సంబంధమని బంగార్రాజును బయటకు పంపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారు రాజు సమాధానం ఇస్తూ కౌన్సిల్ సమావేశానికి తనను చైర్‌పర్సన్, కమిషనర్ ఆహ్వానించారని, ఈ సమావేశానికి చైర్ పర్సన్ బాధ్యత వహించాలి గాని చైర్ పర్సన్‌ని పక్కకు తప్పించి మీరు సమస్యలపై సమీక్ష చేయాల్సిన అవసరం లేదని ఘాటుగా సమాధాన మిచ్చారు. ఈ వాగ్వివాదం నేపథ్యంలో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే సమావేశాన్ని రద్దు చేయాలని వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. అయితే నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ జనసేన పార్టీకి చెందినప్పటికి సమావేశాన్ని రద్దు చేయకుండా కొనసాగించడం కొసమెరుపు.

పొత్తు ధర్మం ఎమ్మెల్యే పాటించరా.?: కర్రోతు

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కూటమి పొత్తు ధర్మాన్ని మరిచి ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మెన్ కర్రోతు బంగార్రాజు విమర్శించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలిచిన లోకం నాగ మాధవి పొత్తు ధర్మాన్ని మరిచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. టిడిపి, జనసేన కూటమిగా అన్ని కార్యక్రమాల్లో వ్యవహరించాల్సి ఉండగా ఎమ్మెల్యే వైసిపి, జనసేన కూటమిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవలి ఎన్ఇఆర్‌జిఎస్ పనుల కేటాయింపులో కూడా ఎమ్మెల్యే వైసిపికి అధిక శాతం పనులు కేటాయించడం ఉదాహరణగా పేర్కొన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే తీరుపై ఇంఛార్జి మంత్రికి ఫిర్యాదు చేశామని, పవన్ కల్యాణ్‌తో కూడా మాట్లాడామని చెప్పారు.

విలేకర్లతో మాట్లాడుతున్న బంగార్రాజు

బైరెడ్డి పాలెంలో అప్రోచ్ రోడ్డు పనులను అడ్డుకుంటున్న రైతులు

అప్రోచ్ రోడ్డు పనులు అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి-భోగాపురం

బైరెడ్డి పాలెం, దల్లిపేట గ్రామాల్లో చేపట్టిన విమానాశ్రయం అప్రోచ్ రోడ్ నిర్మాణ పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. పరిహారం ఇవ్వకుండా కోర్టులో జమ చేసి భూములపైకి ఎలా వస్తారంటూ నిర్మాణ సంస్థ సిబ్బందిని ప్రశ్నించారు. ఇది తెలిసి వెళ్లిన రెవెన్యూ అధికారులకు కూడా పరిహారం ఇవ్వకుండా భూమిపైకి వస్తే సహించలేదని తేల్చి చెప్పారు. న్యాయస్థానంలో స్టే ఉన్నప్పటికీ పనులు ఎలా ప్రారంభిస్తారని నిలదీశారు. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు పనులను విమానాశ్రయ నిర్మాణ సంస్థ అక్కడక్కడా ప్రారంభించింది. దీనిలో భాగంగా కంచెరు, గూడెపువలస రెవెన్యూ పరిధిలోని బైరెడ్డి పాలెం, దల్లిపేట గ్రామాల వద్ద పనులు చేసేందుకు సిబ్బంది బుధవారం వెళ్లారు. అయితే అక్కడ సుమారు 20 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాలో పరిహారం వేశాక పనులు ప్రారంభించాలంటూ అడ్డుకున్నారు. వెంటనే నిర్మాణ సంస్థ ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. తహాశీల్దార్ సురేష్, ఆర్ఐ ఇమ్రాన్, విఆర్ఒ దేవి వెళ్లి రైతులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. పరిహారం విశాఖలోని భూ సేకరణ ట్రిబ్యునల్ కోర్టులో ప్రభుత్వం జమ చేసి ఉందని తహాశీల్దార్ తెలిపారు. తమకు పరిహారం ఇచ్చాకే భూములపై పనులు చేసుకోవాలని రైతులు సమాధానం ఇచ్చారు. దీంతో ఏం చేయాలో తెలియక రెవిన్యూ అధికారులతో పాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సుమారు రెండేళ్లు నుంచి ట్రిబ్యునల్ కోర్టు చుట్టూ తిరుగుతున్నప్పటికీ నేటికీ మాకు నష్టపరిహారం అందలేదని తెలిపారు. పరిహారం వచ్చేవరకు పనులు ప్రారంభించనివ్వ బోమని చెప్పారు.

నడిపల్లిలో ప్రబలిన డయేరియా

బాధితులకు ఎమ్మెల్యే, అధికారుల పరామర్శ



ఆస్పత్రిలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని నడిపల్లిలో సూపర్ క్లోరినేషన్ ప్రభావంతో డయేరియా ప్రబలింది. కలుషిత నీటిని తాగిన 16 మంది వరకు వాంతులు, విరేచనాల బారినపడ్డారు. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సోమ, మంగళవారాల్లో 16మందికి డయేరియా బారిన పడగా, పది మంది మంగళవారం సాయంత్రానికి డిశ్చార్జి అయ్యారని పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజేష్‌వర్మ తెలిపారు. ఈనేపథ్యంలో మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ జోషప్‌తోపాటు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ కవిత, డిఇ వైకుంఠ నాయుడు, తహశీల్దార్ టి. గోవింద, ఎంపిడిఒ రాధిక గ్రామాన్ని పర్యటించారు. సర్పంచి గాయిత్రి మాట్లాడుతూ వైద్యులు సకాలంలో స్పందించి వైద్యం అందించడంతో డయేరియా తీవ్రం కాకుండా చేశామని తెలిపారు. సూపర్ క్లోరినేషన్ చేసిన తరువాత కనీసం పంచాయతీ కార్యాదర్శికైనా సమాచారం ఇవ్వకపోవడంతో డయేరియా బారిన పడినట్లు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

నడిపల్లిలో డయేరియా ప్రబలిందని తెలిసిన వెంటనే నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అధికారులను, వైద్యులును అప్రమత్తం చేసారు. ఆమె హుటాహుటిన నడిపల్లి గ్రామానికి చేరుకొని పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సూపర్‌క్లోరినేషన్ వల్ల ప్రబలిందని అధికారులు చెప్పారు. దాంతో ఆమె ఎందుకు క్లోరినేషన్ జరిగిన తరువాత సమాచారం ప్రజలకు ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేసారు. ఇది మనతప్పని అప్రమత్తంగా ఉండకపోతే సమస్యలు వస్తాయన్నారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం పూసపాటిరేగ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అవసరమైతే విజయనగరం ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

టిడిపి నాయకులు పరామర్శ

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతో పాటు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకర్రావు తదితరులు డయేరియా బాధితులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు.

కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలి : కమిషనర్

విజయనగరంటౌన్ : దీపావళిని కాలుష్యరహితంగా జరుపుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ప్రజలకు సూచించారు. అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు, ఇతర బాణాసంచా వల్ల వాయు కాలుష్యం, పర్యావరణం కాలుష్యం జరుగుతుందని అన్నారు. వాటి నుంచి వచ్చే పొగ వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ కాలుష్య రహితంగా దీపాలను వెలిగించి ఆనందోత్సాహాల నడుమ దీపావళిని జరుపుకోవాలని కోరారు. నగరంలో నగర పాలక సిబ్బందితో కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని ప్రచారం చేపట్టారు.

అందరి జీవితాల్లో వెలుగులు తేవాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట/టౌన్

కోటి దీపాల దీపావళి ప్రజలందరి జీవితాలలో కొంగొత్త వెలుగులు తేవాలని, అంతులేని ఆనందం, శ్రేయస్సు, ఆరోగ్యం, సంపదలతో వర్ధిల్లాలని అకాంక్షిస్తూ ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే పండుగగా, చెడుపై మంచి విజయానికి ప్రతీకగా మనం దీపావళి పండగను జరుపుకుంటామని, ఈ దీపావళి అందరికీ విజయాలను కలుగ జేయాలని తెలిపారు. పండగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్త వహించాలని, దీపావళి అందరి జీవితాలలో సంతోషాల్ని మిగల్చాలని కోరారు.

ప్రజలకు ఎస్‌పి దీపావళి శుభాకాంక్షలు

ప్రజలకు, పోలీసు సిబ్బందికి ఎస్‌పి వకుల్‌జిందాల్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి జీవితాల్లో చీకట్లను పారదోలి, మరిన్ని వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దీపావళి పండగ రోజున పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఆనందంగా, సురక్షితంగా దీపావళి పండగను నిర్వహించుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అమావాస్యనాటి కారు చీకటిని తొలగించడానికి, దీపాలతో వెలుగును నింపడం ఈ పండుగ సంప్రదాయమని, మనలోని అంధకారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతులు వెలిగించాలన్నది ఈ పండుగ వెనుక ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరి జీవితాల్లో సుఖః సంతోషాలు వెల్లివిరియాలని కోరారు.

మేయర్ దీపావళి శుభాకాంక్షలు

నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు నగర మేయర్ వి.విజయలక్ష్మి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాలలో ఎల్లవేళలా వెలుగులు నిండుతూ ఉండాలని ఆకాంక్షించారు. అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని మూడు లాంతర్లు జంక్షన్ నుంచి కోట జంక్షను వరకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 'క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత ఈర్యాలీని ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొని, పోలీసు అమరవీరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తూ అనేక మంది పోలీసులు తమ ప్రాణాలను సైతం కోల్పోయారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదుగురు పోలీసు అధికారులు అంతర్గత భద్రతను పరిరక్షిస్తూ అమరులయ్యారని అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు పిల్లలు, స్కూలు, కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి నగదు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేసారు.

దేశ భద్రత, ఐక్యతకు పటేల్ కృషి

దేశ భద్రత, సమైక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లాపోలీసు కార్యాలయం నుంచి మయూరి కూడలి వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. తొలుత వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, 'యూనిటీ రన్'ను ఎఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం, ఈ పరుగులో పాల్గొన్న, పోలీసు అధికారులు, సిబ్బంది మయూరి కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడి, దేశ సమైఖ్యత, భద్రత, అంతర్గత రక్షణను కాంక్షిస్తూ, ప్రతిజ్ఞ చేసారు.

పుట్టగొడుగుల్లా మందుగుండు షాపులు

- హైవేకి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు
- అడ్డగోలుగా వ్యాపారాలు
- భయాందోళనలో ప్రజలు
- గత ఏడాదికంటే 20శాతం పెరిగిన టపాసుల ధరలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

దీపావళి నేపథ్యంలో నగరంలోని కెఎల్‌పురం నుంచి ఆర్‌టిఒ కార్యాలయం వరకు మందుగుండు విక్రయాల షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అగ్నిమాపక శాఖ, పోలీసుశాఖ, రెవెన్యూ అధికారుల అనుమతితో తాత్కాలిక షాపులను పెట్టుకోవాల్సి ఉండగా, అనుమతులు లేకుండా పలు షాపులు ఏర్పాటు కావడంతో ఆశ్చర్యం కలుగుతోంది. కలెక్టరేట్ నుంచి గజపతినగరం, బొబ్బిలి, సాలూరు వైపు వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా, పెట్రోల్‌బంకు సమీపంలో షాపులు ఏర్పాటు కావడం పట్ల ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులంటూ జనం చర్చించుకుంటున్నారు. హైవేకు కనీసం 100 మీటర్ల దూరం కూడా లేకుండా షాపులు నెలకొల్పారు. వాటికి సమీపంలో ఒక పెట్రోల్ బంక్ కూడా ఉండడం ప్రజలను మరింత భయాందోళనకు గురిచేస్తోంది. ఏదైనా జరగరానిది జరిగితే కనీసం మంటలను అదుపు చేయడానికి కూడా వీలు లేనంత దగ్గరగా ఒకేచోట పది నుంచి పదిహేను షాపులు పెట్టారు. మరోవైపు మందుగుండు సామాగ్రి ధరలకు సంబంధించి కచ్చితమైన పట్టికలు లేకపోవడంతో వ్యాపారులు తమకు నచ్చినట్లు విక్రయిస్తున్నారు.

కెఎల్‌పురం వద్ద వెలిసిన తాత్కాలిక బాణసంచా విక్రయాల షాపులు

పేలిపోతున్న టపాసుల ధరలు

టపాసుల ధరలు పోలిపోతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే అన్ని ధరలూ 20 నుంచి 30శాతం వరకూ పెరిగాయి. ఏది కొందామన్నా వంద రూపాయలపైనే ఉంది. వెయ్యి రూపాయలు తీసుకెళ్తే చిన్న క్యారీబ్యాగ్‌తో కూడా టపాసులు రావడం లేదు. అగ్గిపెట్టె నుంచి తౌజండ్ వాలా వరకు అన్ని ధరలూ భారీగా పెరిగాయి. ట్రాన్సుపోర్టు, పన్నులు, దుకాణ అద్దెలు, కెమికల్స్ ధరల పెరుగుదల టపాసులపై పడిందని, అందుకే ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.

జిల్లాలో కోట్లలో వ్యాపారం

కెఎల్‌పురం లోగల మందుగుండు షాపుల వద్ద కోట్లాది రూపాయల విక్రయాలు జరుగుతున్నాయి. అటు శ్రీకాకుళం, ఇటు ఒడిశా నుంచి కూడా వ్యాపారులు ఇక్కడ హోల్‌సేల్ షాపుల నుంచే బాణాసంచా కొనుగోలు చేస్తుంటారు. జిల్లాలో లైసెన్సు దుకాణాలు అత్యధికంగా విజయనగరంలోనే ఉన్నాయి. ఇవి కాకుండా పండగ మూడురోజులు తాత్కాలిక లైసెన్సు పొంది వందలాది షాపులు వెలుస్తుంటాయి. వాతావరణం కూడా అనుకూలంగా ఉండడంతో ఈ ఏడాది విక్రయాలు పెరిగాయి.

ఏటా పెరుగుతున్న ధరలు

జిఎస్‌టి ఇతర కారణాలతో బాణసంచా ధరలు సామాన్యులకు అందుబాటులో లేనంతగా పెరిగిపోతున్నాయి. పిల్లల సరదా కోసం తమ బడ్జెట్‌కు అనుగుణంగా టపాకాయలు కొనుగోలు చేస్తుంటారు. కార పువ్వొత్తులు, చిచ్చుబడ్లు, తారాజువ్వలు, ఇలా అన్నింటి ధరలూ కొండెక్కాయి. గతంలో రూ.15వందలు పెట్టి కొనుగోలు చేస్తే కుటుంబమంతా పండగ చేసుకునేవారు. నేడు రూ.3వేలు వెచ్చించినా సరిపడా మతాబులు రాని పరిస్థితి నెలకొంది.

దీపావళి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అగ్ని ప్రమాదం జరిగితే అత్యవసర సహాయం కోసం 101, 112, 100, 1070 టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించండి.

బాణాసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బాణాసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించండి.
- మీ ఇంటి కిటికీలు,తలుపులు మూసివేయండి. పసిపిల్లలు ఉంటే ఇంటి లోపలే ఉంచండి.
- పెద్దల పర్యవేక్షణలో మాత్రమే పిల్లలు బాణాసంచా కాల్చాలి
- బాణసంచా కాల్చేటప్పుడు ఒక బకెట్ నీరు మరియు ఇసుకను అందుబాటులో ఉంచుకోండి.
- బాణాసంచాతో ప్రయోగాలు చేయవద్దు. అవి కాల్చేపుడు మీ ముఖాన్ని దూరంగా ఉంచండి.
- కాల్చడంలో విఫలమైన బాణసంచాను మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయవద్దు.
- ఫైర్ క్రాకర్‌లను వెలిగించి విచక్షణా రహితంగా బహిరంగంగా విసిరేయకండి.
- ప్రమాదకర టపాసులు వంటి బాణాసంచా కాల్చే సమయంలో చేతితో పట్టుకోవద్దు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- చీపురుపల్లి

పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

స్థానిక పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ప్రధానంగా చీపురుపల్లి పంచాయతీ కొత్తగవిడి వీధిలో రూ.5 లక్షల జిల్లాపరిషత్ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు, పాతకుమ్మరి వీధిలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు, సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన సిమ్మెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైసిపి మండల నాయకులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాల నాయుడు, యువజన ఉపాధ్యాక్షుడు బెల్లాన వంశీకృష్ణ, కొంచాడ శ్రీనివాస్, సుబుద్ది లక్ష్మణరావు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

వేపాడ: మండలంలో బొద్దాం యాతవీదిలో చేపట్టిన పారిశుధ్యం పనులను బుధవారం ఇఒపిఆర్‌డి ఎస్ రవికుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మీ ఇంటి వద్దకు వచ్చిన శానిటేషన్ సిబ్బందికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో గొంతులలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో గ్రామపంచాయతీ కార్యదర్శి కాకర భారతి, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో జాప్యం వద్దు

బాడంగి: పింఛన్ల పంపిణీలో జాప్యం ఉండకూడదని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో పాల్గొనే సిబ్బంది అందరినీ సమన్వయం చేస్తూ వెళ్ళాలన్నారు. ఒకటో తేదీన ఉదయం 5.30 గంటలకు అందరూ లాగిన్ అయ్యి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. బయట ఉన్న వాళ్లకు ఫోన్ చేసి రప్పించాలన్నారు. మండలం మొత్తం సుమారు 8,500 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బెర్రీ యాజమాన్యం

బొబ్బిలి రూరల్: పర్యావరణ పరిరక్షణకు ఎం.బూర్జవలస చెరువు గట్టుపై బెర్రీ పరిశ్రమ యాజమాన్యం మొక్కలు నాటింది. పర్యావరణ పరిరక్షణకు కాలుష్యాన్ని నియంత్రించి మొక్కలు నాటాలని ఎపిజె అబ్దుల్ కలాం యూత్ అసోసియేషన్ సభ్యులు బెర్రీ పరిశ్రమ విపి శ్రీనివాసరాజును కోరగా కాలుష్యాన్ని నియంత్రిస్తామని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షిస్తామని మాట ఇవ్వడంతో బుధవారం చెరువు గట్టుపై మొక్కలు నాటారు. మొక్కలు సంరక్షణకు గార్డులు ఏర్పాటు చేసి ప్రతిరోజు ట్యాంకర్ తో నీరు పోస్తామన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు ఇచ్చేందుకు ఆర్‌ఒ ప్లాంట్‌ను బాగు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్లె లక్ష్మణరావు, యూత్ అసోసియేషన్ సభ్యులు బెవర గణపతిరావు, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

బొబ్బిలి: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ ఎల్. రామలక్ష్మి అధ్యక్షతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, అన్ని సచివాలయాల వార్డు ఎమినిటీ సెక్రటరీలతో వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, పురపాలక సంఘ సాధారణ నిధులతో చేపడుతున్న పనులపై యాక్షన్ ప్లాన్ జారీ చేశారు. ఇప్పటి వరకు టెండర్లు పిలిచి అగ్రిమెంట్ అయిన పనులను వెంటనే చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కింద మంజూరు చేసిన మొత్తాలను ఫిబ్రవరి 2025లోగా పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మొక్కుబడిగా మేజర్ పంచాయతీ సమావేశం

మాట్లాడుతున్న సర్పంచ్ రామస్వామి

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ సమావేశం బుధవారం సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి సైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశం మొక్కుబడిగానే కొనసాగడం గమనార్హం. గత రెండు సమావేశాలు ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నాయన్న కారణంతో ఎటువంటి తీర్మానాలు లేకుండా ముగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ముచ్చటగా మూడవసారి కూడా తీర్మానాలు ప్రవేశపెట్టలేదు. సర్పంచ్ రామస్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు సభ్యులు చేసిన పనులకు బకాయిలు చెల్లించేందుకే సభలో ఎటువంటి కొత్త తీర్మానాలు ప్రవేశపెట్టడం లేదని తెలిపారు. ఆగస్టు నెలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో ఉపాధి నిధులతో చేయబోయే 261 అభివృద్ధి పనులకు గ్రామ పంచాయతీ పరిధిలో తీర్మానాలకు ప్రతిపాదించగా వాటిలో 36 పనులకు అనుమతులు లభించాయని తెలిపారు. ఈ సమావేశంలో మేజర్ గ్రామపంచాయతీ వైస్ సర్పంచ్ పెనగంటి మంగ వేణి, వార్డు సభ్యులు పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సాగునీరందించాలి

తెర్లాం: తోటపల్లి కాలువ నుంచి పిల్ల కాలువలు ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించాలని, బలిజిపేట రోడ్డు నుంచి సతివాడ గ్రామంలోనికి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం శాఖ తీర్మానం చేసింది. మండలంలోని సతివాడలో బుధవారం సిపిఎం శాఖ సభలు నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి గోపాలం మాట్లాడుతూ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రైతులు గ్రామస్తులతో కలిపి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ సభ్యులు ధనుంజయ్‌రావు, పెంకి రామారావు, రైతులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచుల ద్వారానే ఉపాధి పనులు చేపట్టాలి

మెరక ముడిదాం: మండలంలోని ఉపాధి పనులన్నీ స్థానిక సర్పంచుల ద్వారానే చేపట్టాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు ఎంపిపి తాడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సర్పంచులు ద్వారా కాకుండా వాళ్లకి అనుకూలాంగా ఉండే వ్యక్తులకు అభివృద్ధి పనులను కట్టబెట్టేందుకే వెండర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. సర్పంచులకు కాకుండా వేరే వ్యక్తులకు పనులు అప్పగిస్తే పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు, కందుల పార్వతి, కోట్ల వెంకటరావు, పప్పల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి

శృంగవరపుకోట కోట: ఆర్‌టిసి బస్సుల శుభ్రతలో ప్రజల మన్ననలు పొందే విధంగా సిబ్బంది ఉండాలని డిపో మేనేజర్ కే రమేష్ ఆదేశించారు. బుధవారం ఆయన బస్సుల వాషింగ్ క్లీనింగ్ సిబ్బందితో మాట్లాడుతూ బస్సులను పరిశుభ్రంగా చేసి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. బస్సులు ఎంత బాగుంటే ప్రయాణికులు ఆదరణ అంత బాగుంటుందని తద్వారా సంస్థ అభివృద్ధి చెందుతుందని వివరించారు. గ్యారేజ్ సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగప్పవలసను సందర్శించిన తహశీల్దార్

తెర్లాం: మండలంలో రంగప్పవలస గ్రామంలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి కాలనీలను బుధవారం తహశీల్దార్ జి.హేమంత్ కుమార్ సందర్శించారు. ముందుగా ఎస్‌సి కాలనీ వీధులను పరిశీలించి కాలనీలో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. తాగునీటి ట్యాంకు పనిచేస్తున్నది లేనిది పరిశీలించారు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కొళాయి లేదు, బోరు లేదని గ్రామస్తులు చెప్పారు. కాలనీకి మీదనున్న చెరువు నుంచి నీరు కాలువల ద్వారా వచ్చి ఇళ్లల్లో చేరిపోతుందని పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.సర్పంచ్ ఎస్.రాంబాబు, ఆర్ఐ కృష్ణమూర్తి నాయుడు, విఆర్‌ఒ ఎస్.నరసింహానాయుడు, పాల్గొన్నారు.

వాలీబాల్‌లో మెరిసిన దుర్గా ప్రసాద్

భోగాపురం: స్థానిక శ్రీ కొమ్మూరు అప్పుడుదొర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బంగారు దుర్గా ప్రసాద్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -19 వాలీబాల్ పోటీకి ఎంపికైనట్లు యాజమాన్యం తెలిపింది. ఈనెల 22న విజయనగరం రాజీవ్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి జట్టుకు దుర్గా ప్రసాద్ ఎంపికయ్యాడు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక సిబ్బంది దుర్గాప్రసాద్ ను అభినందించారు.

ఎస్.కోటలో కిడ్నాప్ కలకలం

- రెండు రోజుల్లో ఛేదించిన పోలీసులు
- అదుపులో నలుగురు వ్యక్తులు
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి జిందాల్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలో కిడ్నాప్ కలకలం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని ఎస్‌పి వకుల్ జిందాల్ సమక్షంలో బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి కేసు వివరాలను వెల్లడించారు. గత సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన దంతులూరి వెంకట సూర్యనారాయణ రాజు ఇంటికి ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి తాము పోలీసులమని చెప్పి విచారణ చేపట్టాలని సూర్యనారాయణరాజును వారితో పాటు తీసుకెళ్లారు. ఆ తరువాత సదరు ఇద్దరు వ్యక్తులు బాధితుని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.4లక్షలు ఇవ్వాలని, లేకపోతే సూర్యనారాయణ రాజును చంపేస్తామని బెదిరించినట్లు ఈ నెల 29న ఉదయం 8 గంటలకు బాధితుని అల్లుడు కాకర్లపూడి శివప్రసాద్ ఎస్.కోట పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎస్. భాస్కర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ఎస్ఐ భాస్కరరావు తన సిబ్బందితో కలిసి విచారణ

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

చేపట్టి విశాఖపట్నం మధురవాడ, కొమ్మాది ప్రాంతాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు సూర్యనారాయణ రాజును కిడ్నాప్ చేసినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ చేసిన వారిలో మధురవాడకు చెందిన కసిరెడ్డి రాజు, అనే వ్యక్తికి దంతులూరి వెంకట సూర్యనారాయణ రాజు సుమారు 20 సంవత్సరాల నుంచి పరిచయం ఉంది. సూర్యనారాయణ రాజు ఆస్తిపరుడని తెలిసి కసిరెడ్డి రాజు అతని ఇద్దరు కుమారులైన ప్రవీణ్ కుమార్, సాయి, వారి స్నేహితులు మరొక నలుగురుతో కలిసి కిడ్నాప్ ప్రణాళిక వేశారు. ఇందులో భాగంగా కొట్టాం గ్రామం నుంచి ఈ నెల 28న ఉదయం ప్రాంతంలో పోలీసులమైన చెప్పి వారి ఇంటికి వెళ్లి విచారణ నిమిత్తం బాధితుడిని వారి కారులో ఎక్కించుకొని పద్మనాభం చుట్టు పక్కల ప్రాంతాలలో తిరుగుతూ బాధితుని కుటుంబ బంధువులకు నాలుగు లక్షల రూపాయలను ఇవ్వమని డిమాండ్ చేశారు. డబ్బులు కోసం ఎస్.కోట వైపుగా రెండు కారులలో వస్తుండగా బుధవారం ఉదయం ఉసిరి జంక్షన్ వద్ద ఎస్ఐ భాస్కరరావు వాహనాలు తనికీ నిర్వహిస్తూ ఆ రెండు కారులను కూడా పరిశీలించేందుకు ప్రయత్నించారు. దీంతో కారులో ఉన్న కిడ్నాపర్లు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా నలుగురును పట్టుకుని అదుపులోకి తీసుకుని విచారించి అరెస్టు చేశారు. మరొక ముగ్గురు వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్‌పి తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల వివరాలు సేకరించి వారిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ నారాయణమూర్తి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 2.13 లక్షల మంది ఓటర్లు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నియోజకవర్గం మొత్తం 2,13,695 మంది ఓటర్లు ఉన్నారని తహశీల్దార్ బి.సుదర్శనరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని వారు తెలిపారు. ఇందులో పురుష ఓటర్లు 1,05,674, స్త్రీ ఓటర్లు 1,08,018, ట్రాన్స్ జెండర్లు 3 అని చెప్పారు. ఇందులో నెల్లిమర్ల మండలంలో 62,209 మంది ఓటర్లు ఉండగా పురుషులు 30,645, స్త్రీలు 31,563, ట్రాన్స్ జెండర్ ఒక్కరు అని తెలిపారు. ఓటర్ల నమోదుకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు, వినతులు ఉన్నా నవంబరు 28వ తేదీ లోగా ఆయా ప్రాంతాల బూత్ లెవెల్ అధికారులకు (బిఎల్ఓ) అందజేయాలని సూచించారు. నవంబరు 9,10,23,24 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ నాలుగు రోజులు బిఎల్ఓలు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

పంటల బీమాపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రతి రైతు పంటల బీమాపై అవగాహన కలిగివుండాలని వ్యవసాయ శాఖ ఎడిఎ యం.శ్యాం సుందర్ అన్నారు. బుధవారం మెట్టవలస, పెంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్త పంటల బీమా ప్రభుత్వం కల్పించిందని ఇది నవంబర్ 15వ తేదీలోగా జీడీ మామిడికి నమోదు చేయించుకోవాలని, డిసెంబర్ 15 తేదీలోగా అపరాలు, మొక్కజొన్న, వరి పంటలకు బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. రాబోయే రబీ పంట కాలంలో అపరాల పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెట్టవలస, పెంట గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, సూర్యనారాయణ, మాధవరావు, వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, రేణుక రైతులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి రైతు సేవ కేంద్రం పరిధిలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్ విజయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ మేలైన సాగు పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ మాధురి శరణ్య, సర్పంచ్ విరోతి కొండలరావు, వైస్ సర్పంచ్ అడ్డూరి సత్యనారయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు స్వప్న, రైతులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాళిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి జి.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో

బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న ఎడిఎ శ్యాంసుందర్

నిర్వహించారు. అపరాల సాగు, తెగుళ్లు, చీడ పీడల గురించి వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రభుత్వం త్వరలోనే ప్రారంభిస్తుందని, ఈ పంట నమోదు చేసుకున్న రైతులు అర్హులు అని, రబీ సీజన్ నుంచి రైతులే పంటల బీమా ప్రీమియం కట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ అనురాధ, రైతు సేవ అధికారి మధు, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంట కోత దశలో ఉన్నందున తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గొంప తులసి, రైతుబంధు కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన అందించాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు డిమాండ్

ప్రజాశక్తి- బొబ్బిలి

అక్రమాలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ గోవింద్

మున్సిపాలిటీలో అవినీతి రహిత పాలన అందించాలని వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవిందరావు, టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంటి గోవిందరావు మాట్లాడుతూ రోడ్ల విస్తరణలో టిడిఆర్ బాండ్లు జారీలో అక్రమాలు జరగడంతో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేశారని, అక్రమాలను ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారని ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి కౌన్సిలర్ శరత్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో విజిలెన్స్ దర్యాప్తు జరగడంతో మున్సిపాలిటీ పరువు పోయిందని, ప్రస్తుతం బదిలీపై వచ్చి పని చేస్తున్న నూతన అధికారులు అవినీతి చోటు ఇవ్వకుండా పని చేయాలని సూచించారు. శానిటేషన్ వాహనాలు బాగు చేసేందుకు నిధులు కేటాయిస్తూ తీర్మానం ప్రవేశ పెట్టడంతో వాహనాలు ఎప్పుడు కొనుగోలు చేశారు, ఏ వాహనాన్ని బాగు చేసేందుకు ఎంత ఖర్చు అవుతుందో చెప్పాలని వైస్ చైర్మన్ చెలికాని మురళి కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. మండల పరిధిలోని కోటశిర్లాం గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో వచ్చిన తప్పులు, ఫిర్యాదులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 3 నెలల్లో మొత్తం భూ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను కంప్యూటరీకరణ చేస్తున్నామన్నారు. అనంతరం వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. అప్పటికప్పుడు పరిష్కరించే సమస్యలను వెంటనే సరిదిద్దాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు

బొబ్బిలి: మందుగుండు సామగ్రి వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ రామ్మోహనరావు హెచ్చరించారు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి డౌన్‌లో ఏర్పాటు చేసిన మందుగుండు సామగ్రి అమ్మకాల షాపులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. అధిక ధరలకు అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, తహశీల్దార్ ఎం.శ్రీను, అధికారులు పాల్గొన్నారు.

పేటెంట్ పై సమావేశం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఒక అంశంపై పేటెంట్ పొందాలంటే వాటి విధి, విధానాలు ఎలా ఉండాలనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన బిజినెస్ డెవలప్మెంట్ అండ్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (బిడిఆర్‌ఎం) శాస్త్రవేత్త డాక్టర్ సంజీబ్ కెఆర్ పాల్ జూమ్‌లో వివరించారు. పరిశోధన ప్రచురణలకు పేటెంట్ పొందాలంటే అనుసరించాల్సిన విధానాల గురించి ఆయన వివరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పరిశోధన విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీడయాల్, డాక్టర్ విజయ్ బాబు, ఐక్యూఎసి హెడ్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, అధ్యాపకులు డాక్టర్ సురేంద్ర, బెనర్జీ, ఆసిఫ్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలో ర్యాలీ చేసి తహశీల్దార్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన విద్యార్థులకు ఇవ్వకపోవడంతో ఫీజులు కట్టాలని యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని విమర్శించారు. ఫీజులు కట్టుకోలేక చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యా, వసతి దీవెన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, జానీ, తేజ, చరణ్, చైతు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కారానికై బుధవారం ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్‌కు

బొబ్బిలి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ కె.రమేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లికి వందనంపైన స్పష్టత ఇవ్వాలని, సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. హాస్టల్స్‌లో విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాస్మోటిక్ మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డి.గణేష్, ఏ.అను, వి.చరణ్, మండల ప్రెసిడెంట్ పి.రత్న, కార్తిక్, చైతన్య పాల్గొన్నారు.

భోగాపురంలో పోస్టల్ శాఖ పార్శిల్ హబ్

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నేపథ్యంలో కార్గో సర్వీస్‌కు సంబంధించిన పార్శిల్ హబ్ కోసం భోగాపురంలో భవనాన్ని నిర్మించనున్నట్లు జిల్లా పోస్టల్ సూపరిండెంట్ కొల్లూరు శ్రీనివాస్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ భవనం కోసం కేటాయించిన భూమిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సెంట్లలో భవనాన్ని శరవేగంతో నిర్మించనున్నామని అన్నారు. దీనికి సంబంధించిన నిధులు కూడా కేటాయించనున్నట్లు తెలిపారు. పార్శిల్ హబ్ భవనంతో పాటు భోగాపురం పోస్టల్ కార్యాలయం కూడా ఇందులోనే ఉంటుందని తెలిపారు. విమాన కార్గో సర్వీస్ ద్వారా వచ్చే, పోయే పార్శిల్స్‌ను ఇక్కడి నుంచి శరవేగంతో అందించనున్నట్లు తెలిపారు.

భూమిని అప్పగించిన రెవెన్యూ అధికారులు

పోస్టల్ భవనానికి సంబంధించిన 10 సెంట్లు స్థలాన్ని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో

పోస్టల్ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాస్

స్థలాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

రెవెన్యూ అధికారులు సర్వే చేసి అప్పజెప్పారు. దీనికి సంబంధించి కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను తహశీల్దార్ సురేష్‌కు పోస్టల్ సూపరిండెంట్ అందించారు. మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, ఆర్ కంచేరు సర్వేయర్ అజయ్ అధికారుల సమక్షంలో కొలతలు వేసి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, భోగాపురం ఎస్‌పిఎం పి. శ్రీనివాసరావు, పోస్టల్ సిబ్బంది పోతల జగన్నాథరావు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలను అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంతకవిటి



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న టిడిపి నాయకులు

దళిత వాడలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళీ అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో ఎస్‌సి కాలనీ రహదారులు అధ్వానంగా ఉన్నాయని, చినుకు పడితే చాలు విద్యార్థులు, దళితులు నరక యాతన పడుతున్నారని బుధవారం రాజాంలో ఎమ్మెల్యే మురళీ దృష్టికి మండల టిడిపి నాయకులు మన్నెన రమేష్, దివనాపు సన్యాసిరావు, ఎన్.రామారావు తీసుకువెళ్లారు. అనంతరం సమస్యతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల టిడిపి నేత మన్నెన రమేష్ మాట్లాడుతూ దళితవాడల అభివృద్ధి కోండ్రుతోనే సాధ్యమన్నారు. ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే నెరవేరుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.సుందర్ రావు, నాగరాజు పాల్గొన్నారు.

2 నుంచి అన్న ప్రసాద వితరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా అయ్యప్ప స్వామి మాలాదారులకు అన్న ప్రసాద వితరణ ప్రారంభిస్తున్నట్లు వ్యాపార వేత్త కంది మురళినాయుడు తెలిపారు. బుధవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద జరిగిన విలేఖరుల సమావేశంలో మురళీ నాయుడు మాట్లాడుతూ 12ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సుదూరప్రాంతాల నుండి పట్టణానికి వచ్చే మాలాదారులు మధ్యాహ్నం భోజనం కోసం ఇబ్బందులు పడకూడదని అన్న ప్రసాదం అందించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి పెంటపాటి కామరాజు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాలాదారులతో పాటు శివ, సుబ్రహ్మణ్య, భవానీ మాలాదారులు కూడా పాల్గొనవచ్చునని చెప్పారు.

ఘనంగా దీపావళి సంబరాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని భవాని నగర్‌లోని గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో హిందూ సాంప్రదాయ దీపావళి పండుగను బుధవారం పిల్లలతో ఘనంగా చేపట్టారు. నరకాసురుని దహనం, విద్యార్థులందరూ దీపాలు వెలిగించి బాణాసంచా కాల్చి ఆనందంగా దీపావళి పండుగను జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకటరాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం దీపావళి సందర్భంగా 3,4,5 తరగతుల విద్యార్థులు వేసిన నరకాసురుని వద నాటిక ఆకట్టుకుంది. సాంప్రదాయబద్ధంగా బాలల పండగలు, మన ఆచారాలు, మరిచిపోతున్న ఈ రోజులలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు శ్రీనివాస రావు, రవిశంకర్, రమేష్ నాయుడు, సన్యాసిరావు, గౌరీ పాల్గొన్నారు.

శ్రీరాములుకు సత్కారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలకు అబ్జర్వర్‌గా వ్యవహరించిన మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములను ఈనెల 29 వతేదిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఏవి శ్రీనివాస్ మల్కిపురం శ్రీరామ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిఫరీ పాయసం శ్రీనివాసరావు ఇతర అంపైర్స్, క్రీడాకారులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన కోచ్ లు, మేనేజర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర విజయనగరం జాతీయ రహదారి నుంచి సాయిబాబా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ మీదుగా దెప్పూరు - కొత్త అడ్డతీగ వైపుగా తారు రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం - బొడ్డవర తారు రోడ్డు నుంచి చీడిపాలెం గ్రామంలోనికి గత 60 సంవత్సరాలుగా రోడ్డు మార్గం ఉందని, ఈ మార్గం సమీపంలోనే సాయి బాబా ట్రస్ట్ ఉచితంగా క్యాన్సర్ చికిత్స నిమిత్తం కోట్ల రూపాయలతో హాస్పిటల్ నిర్మాణం చేస్తుందని చెప్పారు. ఈ క్యాన్సర్ హాస్పిటల్ వెనుక భాగంలో దెప్పూరు, కొత్త అడ్డతీగ, కరకవానిజోరు, రాయవానిపాలెం, భక్తాపురం వంటి గిరిజన గ్రామాలు ఉన్నాయని, బొడ్డవర విజయనగరం తారు రోడ్డు వద్ద నుంచి సాయి బాబా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ మీదుగా దెప్పూరు, కొత్త అడ్డతీగ, రాయవానిపాలెం, కరకవానిజోరు మీదుగా తారు రోడ్డు వెయ్యాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఇవిఎం గోదాములు తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తనిఖీల్లో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ భాస్కరరావు, నెల్లిమర్ల తాహశీల్దార్ సుదర్శన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని సన్యాసయ్యపాలెం గ్రామానికి చెందిన దొడ్డ శ్రావణి (22) బుధవారం ఉదయం తన ఇంటిలో ఉరివేసుకోని మృతి చెందింది. ఈవిషయంపై స్థానికులు మట్లాడుతూ సదరు వివాహితకు ఏడాది క్రితం మండలంలోని రాజీపేట గ్రామానికి చెందిన దొడ్డ కిశోర్‌తో వివాహం జరిగిందని అతను పాల వ్యాన్ నడుపుతాడని తెలిపారు. వివాహిత గత కొద్దికాలంగా తన కన్నవారింట సనాసయ్యాపాలెంలో వుంటుందని ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుందని తెలిపారు. బుధవారం ఉదయం తాను పాఠశాలకు వెళ్తానని క్యారియర్ కట్టాలనీ తన తల్లి లక్ష్మికి చెప్పిందని, కూతురుకు క్యారియర్ కట్టాక తన భర్త జగన్నాదంతో పోలానికి తల్లి వెళ్లిపోయిందని తెలిపారు. పాఠశాలకు తయారైన శ్రావణీ తన తల్లిదండ్రులు పోలానికి వెళ్లిన తరువాత ఇంట్లో ప్యాన్‌కు ఉరివేసుకుందని చెప్పారు. అసలు శ్రావణీ ఎందుకు చనిపోయిందో ఎవ్వరికి అర్థంకావడం లేదని తెలిపారు. ఆమె చనిపోయిన సమీపంలో తన వాడే పోన్ వుందని అందులో వున్న డేటా మొత్తం చెరిపివున్నట్లు ఉందని సమాచారం. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఎస్ఐ గంగరాజు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈమె మృతితో గ్రామంలో విషాద వాతవరణం నెలకొంది.

నేరాలు ఘోరాలు

అదృశ్యంపై కేసు నమోదు

రామభద్రపురం: మండలంలోని చిన నేరళ్ళవలస గ్రామానికి చెందిన పసుపులేటి మధు (39) గత కొన్ని రోజులుగా కనిపించక పోవడం పై భార్య సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మధు సీతను 9 సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకొని సజావుగా కాపురం చేసుకుంటున్నారు. ఇటీవలి మధు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇంట్లో వాకబు చేశారు. అతని ఫోన్ కూడా పనిచేయక పోవడంతో కుటుంబ సభ్యుల సూచనల మీదట పోలీసులకు భార్య సీత ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు.

మద్యంతో వ్యాపారి అరెస్టు

బొబ్బిలి: అక్రమంగా తరలిస్తున్న మద్యంతో వ్యాపారి వారణాసి నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన వారణాసి నాగరాజు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. బెల్ట్ షాపునకు అక్రమంగా మద్యం తరలిస్తుండగా చర్చి సెంటర్లో ఏఎస్ఐ సన్యాసిరావు దాడి చేసి 19 మద్యం సీసాలను సీజ్ చేసి వ్యాపారిని అరెస్టు చేశారు. వ్యాపారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు.